# ఇండియన్ పాలిటీ

## ఎన్నికల సంఘం

**ప్రజాస్వామ్యం, ఎన్నికలు విడదీయరానివి. భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఉన్న రాజ్యాంగబద్ధమైన నాలుగు స్తంభాల్లో సుప్రీంకోర్టు, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌తో పాటు భారత ఎన్నికల సంఘం ఒకటి. రాజ్యాంగ నిర్మాతలు భారతదేశంలో నిర్భయంగా, నిష్పక్షపాతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో, నిర్ణీత కాలవ్యవధుల్లో ఎన్నికలు జరిపే అధికారాలు, బాధ్యతను భారత ఎన్నికల సంఘానికి కేటాయించారు. ఇది 1950 జనవరి 25న ఏర్పాటైంది. అందుకే ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.**

రాజ్యాంగంలోని XVవ భాగంలో 324 నుంచి 329 వరకు ఉన్న నిబంధనలు ఎన్నికల సంఘంతోపాటు ఎన్నికలకు సంబంధించిన విషయాల గురించి వివరిస్తాయి. 324వ నిబంధన ఎన్నికల సంఘం నిర్మాణం, అధికారాలు, విధులను వివరిస్తుంది. దేశంలో ఇప్పటివరకు కొన్ని రాజ్యాంగబద్ధ సంస్థలపై విమర్శలు వచ్చినప్పటికీ భారత ఎన్నికల సంఘం విశ్వసనీయత, సమర్థత, నిష్పక్షపాత వైఖరిపై ప్రజలు, రాజకీయ పార్టీలు, న్యాయవ్యవస్థ అపారమైన నమ్మకాన్ని కలిగి ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు అయినప్పటికీ ప్రభుత్వ అధికార మార్పిడి శాంతియుతంగా, నిరాటంకంగా కొనసాగుతోంది.

భారత ఎన్నికల సంఘం భారత పార్లమెంటు, రాష్ట్ర శాసనసభ ఎన్నికలు, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలను నిర్వహిస్తుంది. ఇప్పటివరకు రాష్ట్రపతి ఎన్నికలు 14 సార్లు, ఉపరాష్ట్రపతి ఎన్నికలు 13 సార్లు, లోక్‌సభ ఎన్నికలు (సాధారణ, మధ్యంతర ఎన్నికలు) 16 సార్లు నిర్వహించింది. ఇవి కాకుండా ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి రాజ్యసభ ఎన్నికలు, 3000కు పైగా శాసనసభ ఎన్నికలు, శాసన మండలి ఎన్నికలు జరిగాయి. అన్నింటికి మించి ఉప ఎన్నికలు నిర్వహించడం నిరంతర ప్రక్రియగా కొనసాగుతూ ఉంటుంది.

### నియామకం, తొలగింపు..

ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్లను ప్రధానమంత్రి సలహా మేరకు రాష్ట్రపతి నియమిస్తారు. సాధారణంగా సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమిస్తారు (రాజ్యాంగం ప్రత్యేకంగా అర్హతలు పేర్కొనలేదు). వీరి పదవీకాలం 6 సంవత్సరాలు లేదా 65 సంవత్సరాలు వయసు నిండేవరకు పదవిలో కొనసాగుతారు (రాజ్యాంగం నిర్ణీత పదవీకాలాన్ని పేర్కొనలేదు). అయితే ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించాలంటే అసమర్థత, నిరూపితమైన దుష్ప్రవర్తన కారణాలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులను తొలగించే పద్ధతిలో (అభిశంసన తీర్మానం) మాత్రమే తొలగించగలరు. సాధారణ ఎన్నికల కమిషనర్లను ప్రధాన ఎన్నికల కమిషనర్ సిఫారసుతో తొలగిస్తారు. అయితే మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎన్. గోపాలస్వామి ఎన్నికల కమిషనర్ నవీన్ చావ్లాను తొలగించాలని రాష్ట్రపతికి సిఫారసు చేయడంతో కొత్త వివాదం చెలరేగింది. కానీ ప్రభుత్వం ఎన్నికల కమిషనర్లు నిర్భయంగా పనిచేయాలని కాబట్టి ప్రధాన ఎన్నికల కమిషనర్ ఏకపక్షంగా తొలగించలేరని ప్రభుత్వం ఇచ్చిన సలహా, సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రధాన ఎన్నికల కమిషనర్ సిఫారసును అప్పటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ తిరస్కరించారు.

### వేతనం, సౌకర్యాలు

ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్‌కు, ఇద్దరు ఎన్నికల కమిషనర్లకు సుప్రీంకోర్టు సాధారణ న్యాయమూర్తులకు లభించే వేతనం, ఇతర సౌకర్యాలు లభిస్తాయి (ఎన్నికల సంఘంలోని ప్రధాన కమిషనర్‌కు, ఇద్దరు ఎన్నికల కమిషనర్లకు సమాన జీతభత్యాలు లభిస్తాయి). పదవీకాలంలో వారి జీతభత్యాలను తగ్గించేలా ఎలాంటి చర్యలు తీసుకోరాదు. వీరి జీతభత్యాలను పెంచే అధికారం భారత పార్లమెంటుకు ఉంటుంది. వీరిని పదవీ విరమణ తర్వాత ప్రభుత్వం ఇతర పదవులకు నియమించకూడదనే నిబంధన రాజ్యాంగంలో లేదు.

### ఎన్నికల సంఘం అధికారాలు, విధులు

రాజ్యాంగం – ప్రజాప్రాతినిధ్య చట్టం 1950, ప్రజాప్రాతినిధ్య చట్టం 1951, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల చట్టం 1952, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ చట్టం 1963, జాతీయ రాజధాని ప్రాంతం దిల్లీ ప్రభుత్వ చట్టం 1991, ప్రజా ప్రాతినిధ్య చట్టం 2010, ఎన్నికల కోసం రాష్ట్రపతి/ పార్లమెంటు జారీ చేసిన ఇతర ఉత్తర్వులు, ఆదేశాలు, చట్టాలకు అనుగుణంగా తనకు నిర్దేశించిన విధులను ఎన్నికల సంఘం నిర్వహిస్తుంది.

### నియోజక వర్గాల పునర్విభజన

దేశం మొత్తం భూభాగాన్ని జనాభా ప్రాతిపదికన పార్లమెంటరీ నియోజక వర్గాలుగా, శాసనసభ నియోజకవర్గాలుగా విభజించారు. ప్రతి జనాభా లెక్కల గణన తర్వాత నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ చేయాల్సి ఉంటుంది. దీనికోసం కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ కమిషన్‌ను నియమిస్తుంది. డీలిమిటేషన్ కమిషన్ సిఫారసులకు అనుగుణంగా నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరించడం ఎన్నికల సంఘం బాధ్యత. 1952లో మొదటి డీలిమిటేషన్ కమిషన్‌ను నియమించగా, తర్వాత 1962, 1972 సంవత్సరాల్లో, తిరిగి 2002లో మాత్రమే నియమించారు. 42వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ 2000 తర్వాత జరిగే జనాభా లెక్కల అనంతరమే జరగాలని రాజ్యాంగంలోని 82వ నిబంధనను సవరించారు. తర్వాత 84, 87 రాజ్యాంగ సవరణ చట్టాల ద్వారా నియోజక వర్గాల సంఖ్యను 2026 వరకు మార్చకూడదని పార్లమెంట్ నిర్ణయించింది. కాబట్టి నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ 2031 జనాభా లెక్కల సేకరణ తర్వాత మాత్రమే సాధ్యమవుతుంది.

### ఎన్నికల నిర్వహణ

ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడం అనేది ఎన్నికల సంఘం స్వతంత్రంగా నిర్ణయిస్తుంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలయ్యేలా చూడటం, ఎన్నికల నోటిఫికేషన్‌ను అధికారికంగా విడుదల చేయడం, నామినేషన్ పత్రాల స్వీకరణ, వాటిని రిటర్నింగ్ అధికారులు (రాజ్యాంగంలోని 84వ నిబంధన (పార్లమెంటుకు అర్హతలు)), 102వ నిబంధన (పార్లమెంటుకు అనర్హతలు), 173వ నిబంధన (రాష్ట్ర శాసనసభకు అర్హతలు), 191వ నిబంధన (రాష్ట్ర శాసనసభకు అనర్హతలు) రాజ్యాంగ నిబంధనలను అనుసరించి పరిశీలిస్తుంది, డిపాజిట్ చెల్లింపు, పోటీచేసే అభ్యర్థి సంతకం, సమర్థించే ఓటర్ల సంతకాలు మొదలైన వివరాలన్నీ సక్రమంగా ఉన్నాయో, లేవో పరిశీలిస్తారు.

నామినేషన్ పత్రాల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత పోటీ చేసే అభ్యర్థుల ప్రచారానికి కనీసం రెండు వారాలు లేదా 14 రోజుల గడువులో వివిధ దశల్లో ఎన్నికలను నిర్వహిస్తారు. ఎన్నికలు సక్రమంగా జరగడానికి అవసరమైన అన్ని చర్యలను ఎన్నికల సంఘం తీసుకోవాల్సి ఉంటుంది. పోలింగ్‌స్టేషన్ గుర్తింపు, అందులో సమస్యాత్మకమైనవి, అత్యంత సమస్యాత్మకమైనవి గుర్తించడం, పోలింగ్ అధికారుల నియామకం, శిక్షణ, భద్రతా సిబ్బంది తరలింపు, పోలింగ్‌కు అవసరమైన వస్తు, యంత్ర సామగ్రిని చేరవేయడం మొదలైనవి. అయితే ఓటింగ్ సందర్భంగా రిగ్గింగ్, పోలింగ్ బూత్‌ల ఆక్రమణ, రహస్య ఓటింగ్‌కు అంతరాయం కలగడం, హింస చెలరేగడం మొదలైనవి సంభవించినప్పుడు ఎన్నికలను రద్దుచేసి తిరిగి ఎన్నికలను నిర్వహించే అధికారం ఎన్నికల సంఘానికి ఉంటుంది. అసాధారణ పరిస్థితుల్లో ఎన్నికలను వాయిదా వేయగల అధికారం ఎన్నికల సంఘానికి ఉంది.

ఎన్నికలను సక్రమంగా నిర్వహించిన తర్వాత, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరిచి, ఓట్ల లెక్కింపుకు తగిన ఏర్పాట్లు చేస్తుంది. ఫలితాలను సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అధికారికంగా ప్రకటిస్తారు. అంతిమంగా లోక్‌సభకు ఎన్నికల అభ్యర్థుల జాబితాను రాష్ట్రపతికి, రాష్ట్ర విధానసభకు ఎన్నికైన అభ్యర్థుల జాబితాను రాష్ట్ర గవర్నరుకు ఎన్నికల సంఘం సమర్పిస్తుంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల సంఘం విధి నిర్వహణలో కార్యనిర్వాహక శాఖ గానీ, సుప్రీంకోర్టు లేదా హైకోర్టు గానీ జోక్యం చేసుకోవు. అది పూర్తిగా ఎన్నికల సంఘం విచక్షణాధికారం. అందులో జోక్యం చేసుకునే అధికారం ఎవరికీ లేదు.

### ఎన్నికల వ్యయం

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయాన్ని ఎన్నికల సంఘం పరిశీలిస్తుంది. అందుకు అవసరమైన మార్గదర్శకాలను విడుదల చేసి ప్రతి నియోజకవర్గానికి ఎన్నికల వ్యయపరిశీలకులను నియమిస్తుంది. ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థి తమ ఎన్నికల వ్యయాలకు సంబంధించిన లెక్కలను ఎన్నికల సంఘానికి సమర్పించాలి. నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేసిన అభ్యర్థులను అనర్హులుగా అధికారిక గెజిట్‌లో పొందుపరుస్తుంది. ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికలకు పెద్ద రాష్ట్రాలు, జాతీయ రాజధాని ప్రాంతం దిల్లీలో 70 లక్షలు, చిన్న రాష్ట్రాలు, ఇతర కేంద్రపాలిత ప్రాంతాల్లో 54 లక్షలు గరిష్ఠ వ్యయపరిమితిగా నిర్ణయించారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో పెద్ద రాష్ట్రాలు, జాతీయ రాజధాని ప్రాంతం దిల్లీలో 28 లక్షలు చిన్న రాష్ట్రాలు, ఇతర కేంద్రపాలిత ప్రాంతాల్లో 20 లక్షలు గరిష్ఠ వ్యయపరిమితిగా ఉంది.

పార్లమెంటుకు జరిగే ఎన్నికల వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. రాష్ట్ర శాసనసభకు జరిగే ఎన్నికల వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. పార్లమెంటు, రాష్ట్ర శాసనసభకు ఉమ్మడిగా జరిగితే ఎన్నికల వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా పంచుకుంటాయి. ఓటర్ల జాబితాలను రూపొందించడం, ఓటింగ్ యంత్రాలు, ఫొటో గుర్తింపు కార్డులు మొదలైన కార్యకలాపాలకు చేసే వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా పంచుకుంటాయి.

**సలహా అధికారం**

ఎన్నికలు పూర్తయిన తర్వాత ఎన్నికైన అభ్యర్థులకు సంబంధించిన అనర్హతను నిర్ణయించే అధికారం ఎన్నికల సంఘానికి ఉంటుంది. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించినా, ఎన్నికల వ్యయానికి సంబంధించిన వివరాలు ఎన్నికల సంఘానికి సమర్పించకపోయినా వారిని అనర్హులుగా ప్రకటించగలదు.

సుప్రీంకోర్టు, హైకోర్టు పరిధిలోకి వచ్చిన ఎన్నికల సంబంధమైన కేసుల్లో కోర్టులు ఎన్నికల సంఘం అభిప్రాయాలను కోరతాయి. వారిని అనర్హులుగా ప్రకటించాలా, వద్దా? ప్రకటిస్తే ఎంతకాలం అనేది ఎన్నికల సంఘం తెలియజేస్తుంది. ఎన్నికల అనర్హతకు సంబంధించి ఎన్నికల సంఘం అభిప్రాయాన్ని రాష్ట్రపతి రాష్ట్ర గవర్నర్ తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది.

**ఎన్నికల వివాదాలు**

ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత ఎన్నికలకు సంబంధించిన వివాదాలకు పార్లమెంటు, రాష్ట్ర విధానసభలకు సంబంధించి సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో విచారణ జరుగుతోంది. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల వివాదాలను విచారించే అధికారం కేవలం సుప్రీంకోర్టుకు మాత్రమే ఉంది.

**ప్రచారం, అవగాహన**

ప్రవర్తనా నియమావళిని రూపొందించి ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంటుంది.

ఎన్నికలకు సంబంధించి ఓటర్లకు అవగాహన కల్పించడానికి దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియో ద్వారా అవగాహన కార్యక్రమాలను ప్రసారం చేస్తుంది. జాతీయ, ప్రాంతీయ పార్టీలకు ప్రభుత్వ ప్రసార మాధ్యమాల్లో తగిన సమయాన్ని కేటాయిస్తుంది.

భారత ఎన్నికల సంఘం, 'అంతర్జాతీయ ప్రజాస్వామ్య ఎన్నికల సహాయ సంస్థ'లో సభ్యత్వం కలిగి ఉంది. తన నైపుణ్యాన్ని ఇతర దేశాలతో పంచుకోవడంతోపాటు, ఇతర దేశాల్లో అత్యుత్తమ పద్ధతులను భారత ఎన్నికల నిర్వహణలో అమలుచేయడానికి ప్రయత్నిస్తుంది.

## ఓటర్ల జాబితా

రాజ్యాంగంలోని 326వ నిబంధన ప్రకారం 18 సంవత్సరాలు (61వ రాజ్యాంగ సవరణ చట్టం, 1989 ద్వారా ఓటు హక్కు పొందడానికి కనీస వయసును 21 నుంచి 18 కి తగ్గించారు) నిండిన వయోజనులందరికీ ఓటు హక్కు కల్పించాలని తెలియజేస్తుంది. ఇది ఎన్నికల సంఘం బాధ్యత. నమోదైన ఓటర్లతో కూడిన జాబితాలను రూపొందిస్తుంది. ఎప్పటికప్పుడు కొత్త ఓటర్లను నమోదు చేయడం, మరణించినవారు, అవినీతి, తీవ్రనేరాలు మొదలైన కారణాల వల్ల ఓటు హక్కు కోల్పోయిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం లాంటి విధులను ఎన్నికల సంఘం నిర్వహిస్తుంది.

■ ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని IV A భాగంలో 29 A సెక్షన్ ప్రకారం రాజకీయ పార్టీలను నమోదు చేస్తుంది. గుర్తింపు పొందిన పార్టీలను జాతీయ పార్టీ లేదా ప్రాంతీయ పార్టీగా విభజిస్తుంది. గుర్తింపు పొందిన పార్టీలకు, నమోదైన పార్టీలకు, స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులను కేటాయిస్తుంది. రాజకీయ పార్టీల్లో వచ్చిన చీలికలకు సంబంధించిన వివాదాల్లో అసలైన పార్టీ ఏదో, చీలిక వర్గం ఏదో ఎన్నికల సంఘం గుర్తిస్తుంది.

## ఎన్నికల సంఘం నిర్మాణం

ఎన్నికల సంఘం నిర్మాణం గురించి రాజ్యాంగంలోని 324వ నిబంధన తెలియజేస్తుంది. 324 (2) క్లాజు ప్రకారం ఎన్నికల సంఘంలో ఒక ప్రధాన ఎన్నికల కమిషనర్, రాష్ట్రపతి/పార్లమెంటు నిర్ణయించిన విధంగా ఎన్నికల కమిషనర్లు ఉంటారు. 1950 నుంచి 1989, అక్టోబరు 15 వరకు ఎన్నికల సంఘం ఏకసభ్య సంఘంగా ఉండేది. అయితే 1989, అక్టోబరు 16న రాష్ట్రపతి, ఎస్.ఎస్. ధనోవా, వి.ఎస్. సైగల్‌లను ఎన్నికల కమిషనర్లుగా నియమించడంతో ఎన్నికల కమిషన్ బహుళసభ్య సంఘంగా ఏర్పడింది. అయితే వీరిని 1990, జనవరి 1న తొలగించడంతో ఎన్నికల సంఘం తిరిగి ఏకసభ్య సంఘంగా ఏర్పడింది. అప్పటి ప్రధాన ఎన్నికల కమిషనర్ టి.ఎన్. శేషన్ తీసుకున్న కొన్ని ఏకపక్ష నిర్ణయాలతో ఎన్నికల సంఘం నియంతృత్వ పోకడలను నియంత్రించడానికి మెజారిటీ రాజకీయ పార్టీల కోరిక మేరకు ఎన్నికల సంఘాన్ని తిరిగి 1993, అక్టోబరు 1న బహుళసభ్య సంఘంగా చేస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీచేశారు. ఎం.ఎస్. గిల్, జి.వి.జి. కృష్ణమూర్తి ఎన్నికల కమిషనర్లుగా నియమితులయ్యారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎన్నికల సంఘం ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. అధికారాల్లో ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల మధ్య ఎలాంటి తేడాలు లేవు. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల అభిప్రాయాల్లో తేడాలు ఉన్నట్లైతే ఎన్నికల సంఘం నిర్ణయాల మెజారిటీ ఆధారంగా తీసుకుంటారు.

**ఎన్నికల సంఘం వినూత్న కార్యక్రమాలు**

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు చేయడం, ఎన్నికలు జరుగుతున్న తీరును అంతర్జాలం ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయడం, ఓటర్ల జాబితాలను కంప్యూటరీకరించడం, ఎన్నికల ఫొటో గుర్తింపు కార్డులను జారీ చేయడం, ఎన్నికల వ్యయ పరిశీలకులను నియమించడం, ఓటర్ల జాబితాలో ఒకే పేరుతో వేర్వేరు చోట్ల ఉన్న పేర్లను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో తొలగించడం, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను ఉపయోగించడం, జాతీయ ఓటర్ల దినోత్సవంపై ఓటర్లలో విస్తృత అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం, నిరంతరం ఓటర్ల నమోదుకు బూత్‌స్థాయి అధికారుల నియామకం (BLO), మహిళలు, వృద్ధులు, వికలాంగులు సులభంగా ఓటు హక్కు వినియోగించుకోవడానికి తగిన ఏర్పాట్లు చేయడం, షెడ్యూల్డ్ కులాలు, తెగల ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవడానికి వీలైనంత వరకు అదే గ్రామంలో పోలింగ్‌స్టేషన్లను ఏర్పాటు చేయడం మొదలైన అనేక వినూత్నమైన నిర్ణయాలను అమలు చేస్తోంది.

**రచయిత: డాక్టర్ ఎం. భాస్కర్‌రాజు**

www.eenadupratibha.net